విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి



గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

కాచిగూడ: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. బెంగళూర్‌లో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో కాచిగూడలోని జీవీఆర్ కరాటే అకాడమీ నుంచి 18 మంది విద్యార్థులు పాల్గొని కటా, కుమితి విభాగాల్లో 29 బంగారు పతకాలు, 6 రజత పతకాలతో పాటు ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులను ఆదివారం బర్కత్‌పురలోని తన నివాసంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అభినందించారు. కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జీఎస్. గోపాల్‌రెడ్డి, అమృతరెడ్డి, ఘన సంతోషిణిరెడ్డి, అవిఘ్న వెంకట్ రెడ్డి, లక్కాకుల అన్విత్ పటేల్, గీతేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు షురూ..



వీహెచ్‌కు మొదటి సభ్యత్వం అందజేస్తున్న డా. కొండ దేవయ్యపటేల్

కాచిగూడ: తెలంగాణ మున్నూరుకాపు సంఘం పటేల్స్ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఆదివారం ప్రారంభమైంది. సంఘం మొదటి సభ్యత్వాన్ని సీనియర్ కాంగ్రెస్ నేత వి.హనుమంతరావుకు బాగ్ అంబర్‌పేట లోని ఆయన నివాసంలో సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య అందజేశారు. సంఘం అభివృద్ధికి, ఐక్యతకు ప్రతి ఒక్కరూ సంఘం సభ్యత్వాన్ని తీసుకోవాలని వి.హనుమంతరావు సూచించారు. కార్యక్రమంలో సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఆర్.వి.మహేందర్ కుమార్ పటేల్ పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న బస్తీ కమిటీ సభ్యులు

ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్ రాంనగర్ మేడిబావి బస్తీలో అమ్మవారి ఒడిబియ్యంతో ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నర్సింగ్‌రావు, కె.కాశీనాథ్, నర్సింహ, జహంగీర్, ప్రభాకర్, అభి తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో శివసేన పోటీ

శివసేన గ్రేటర్ అధ్యక్షుడు డా.గౌట్ గణేష్

కాచిగూడ: త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో శివసేన (యూబీటీ) పార్టీ పోటీ చేస్తుందని పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు డాక్టర్ గౌట్ గణేష్ అన్నారు. ఆదివారం నారాయణగూడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వచ్చే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బలమైన అభ్యర్థులను పార్టీ తరపున పోటీలో నిలుపుతామని అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పార్టీని మరింత బలోపేతం చేసే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గోషమహల్ ప్రాంతానికి చెందిన రాధిక తన అనుచరులతో కలిసి శివసేన (యూబీటీ) పార్టీలో చేరారు. ఆమెకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... బాల సాహెబ్ ఠాక్రే స్థాపించిన శివసేన పార్టీలో చేరడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. మహిళలు రాజకీయాల్లో రావాల్సిన అవసరం ఉందని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పూస శ్రీనివాస్, సుదర్శన్, మహేష్ కుమార్, ఠాకూర్ వికాస్ సింగ్, వంశీధర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి గుణపాఠం తప్పదు

లిబర్టీ: బీసీలకు రిజర్వేషన్లు కల్పించ తీరకపోతే బీజేపీ ప్రభుత్వం తీవ్ర పరిణామాలు ఎదుర్కొవాల్సి వస్తోందని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్రు కుమారస్వామి హెచ్చరించారు. బీసీలతో పెట్టుకుంటే ఏ ప్రభుత్వం మనుగడ సాగించలేదని గుర్తుచేశారు. దళ్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యమం ఊపిరిగా పోరాటమే ధ్యేయంగా బీసీలు గడిచిన కొన్ని సంవత్సరాలుగా పోరాటాలు సాగిస్తున్న కేంద్రంలోని బీజేపీ సర్కార్ తమ డిమాండ్‌ను పెడచెవిన పెడుతోందని విమర్శించారు. బీసీలతో పెట్టుకుంటే ఏ ప్రభుత్వం మనుగడ సాగించలేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ముమ్మాటికీ బీసీల వ్యతిరేక ప్రభుత్వమేనని ఏ ఎన్నికలు జరిగిన బీసీలు కేంద్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారన్నారు.

వీధుల్లోకి వరద

- భారీ వర్షాలకు రత్నానగర్‌లో పొంగిపొర్లిన డ్రైనేజీలు
- సమస్య పరిష్కారానికి కార్పొరేటర్ తక్షణ చర్యలు
- నాలా పరీవాహక ప్రాంతాల వాసులు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి



రత్నానగర్‌లో డ్రైనేజీలో వ్యర్థాల తొలగింపు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ అమృత

నల్లకుంట: వర్షాకాలం ప్రారంభానికి ముందే నాలాలు, డ్రైనేజీ, కచ్చా మోరీల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాల్సిన సంబంధిత శాఖ అధికారులు అలసత్వాన్ని ప్రదర్శించారు. దీంతో కొద్దిపాటి వర్షాలు కురిసినా వర్షపు నీరు సజావుగా వెళ్లే మార్గం లేక కచ్చా మోరీలు, డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. దీంతో వీధుల్లోకి వరద నీరు, మురుగు చేరుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అస్తవ్యస్త డ్రైనేజీపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు నల్లకుంట డివిజన్ పరిధిలోని రత్నానగర్, శివానంద్‌నగర్, సత్యానగర్ బస్తీలో డ్రైనేజీ, కచ్చా మోరీలు పొంగిపొర్లుతున్నాయి. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి రత్నానగర్‌లోని డ్రైనేజీలు నిండి వీధుల్లోకి చేరి తీవ్రమైన దుర్గంధం వెలువడింది. దీంతో వీధుల్లోకి రావాలంటే స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యను కార్పొరేటర్ అమృత దృష్టికి బస్తీవాసులు తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కార్పొరేటర్ బస్తీలో పర్యటించారు. బస్తీని ఆనుకుని ప్రవహిస్తున్న హుస్సేన్‌సాగర్ నాలాలో నీటి ప్రవాహాన్ని కూడా పరిశీలించారు. అక్కడి నెలకొన్న డ్రైనేజీ సమస్యను స్వయంగా చూసిన ఆమె వెంటనే హైడ్రా, జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సిబ్బందిని అక్కడికి రప్పించి డ్రైనేజీ, కచ్చా మోరీల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగింపజేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. గత కొద్ది రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నందున హుస్సేన్‌సాగర్ నాలాలో నీటి ప్రవాహం పెరుగుతుందన్నారు. నాలా పరీవాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరద సమస్యలు తలెత్తితే బస్తీల పెద్దలు అప్రమత్తమై వెంటనే జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో పాటు తనకు సమాచారం అందించాలన్నారు. వెంటనే సంబంధిత శాఖ సిబ్బందితో పాటు తాను అక్కడికి చేరుకుని తక్షణ సహాయక చర్యలు చేపడతామని చెప్పారు.



రత్నానగర్ హుస్సేన్‌సాగర్ నాలాలో నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్

మ్యాన్‌హోళ్ల మూతలు తొలగించొద్దు..

వర్షాలు కురిసే సమయాల్లో ఎవరూ కూడా విద్యుత్ స్తంభాల పక్క నుంచి నడవొద్దన్నారు. అదే సమయంలో డ్రైనేజీ సమస్యలు తలెత్తితే జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులకు సమాచారం లేకుండానే డ్రైనేజీ, కచ్చా మోరీల మ్యాన్‌హోళ్ల మూతలు తొలగించవద్దని సూచించారు. అత్యవసర పరిస్థితిలో మ్యాన్ హోళ్ల మూతలు తెరిస్తే అక్కడ ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రత్నానగర్ బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ పెద్దలు పి.ఈశ్వర్, ఎంబీ. కిషోర్‌కుమార్, రాముయాదవ్, పాతకోటి మహేష్, వీరయ్యగౌడ్, బస్తీవాసులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు ప్రధాని మోదీతోనే సాధ్యం

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య
- ఈనెల 18న బీసీల చలో ఢిల్లీ కార్యక్రమం



కాచిగూడ: చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో ఆగస్టు 18, 19న బీసీల చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. 18 బీసీ సంఘాలు, విద్యార్థి, ఉద్యోగ, కుల సంఘాల సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆయన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రాజ్యాధికారంలో బీసీల వాటాకై ఢిల్లీలో జాతీయ స్థాయిలో సెమినార్ నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. చట్టసభల్లో రిజర్వేషన్లు ప్రధాని నరేంద్రమోదీతోనే సాధ్యమవుతుందని అన్నారు. అది త్వరలోనే సాకారం కానుందని ఆయన తెలిపారు. 77 సంవత్సరాల స్వాతంత్ర్య భారత చరిత్రలో ఏ పార్టీ ప్రభుత్వం కూడా కులగణన చేపట్టలేదని అన్నారు.

◆ ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం తొలిసారిగా జనాభా గణనతో పాటు కులగణన చేపట్టబోతుందని ఆయన తెలిపారు. కులగణన తర్వాత బీసీలకు అన్ని రంగాల్లో జనాభా ప్రకారం వాటా లభిస్తుందన్నారు. సమాజంలో విప్లవాత్మకమైన మార్పు వస్తుందని పేర్కొన్నారు. రూ.75కోట్లకు పైగా ఉన్న బీసీల చిరకాల కులగణన డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం గౌరవించినట్లుగానే, చట్ట సభల్లో రిజర్వేషన్లును మోదీ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. కులగణన విషయంలో 1931లో బ్రిటీష్ ప్రభుత్వం తీసిన లెక్కల తరువాత నరేంద్రమోదీ ప్రభుత్వం సాహసోపేత నిర్ణయం తీసుకుందని ఆయన ప్రశంసించారు. కుల గణన తర్వాత బీసీలకు చట్టసభలలో 50శాతం రిజర్వేషన్లు, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ, జనాభా ప్రకారం విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల పెంపు వంటి నిర్ణయాలు కూడా తీసుకుంటుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

ఉప్పలమ్మను భక్తితో పూజిస్తే అన్ని శుభాలే..



జవహర్‌నగర్‌లో ఉప్పలమ్మ బోనాల వేడుకలో బీజేపీ నేతలు వినయ్‌కుమార్, నర్సింగరావు, ఆలయ చైర్మన్ సంజీవరెడ్డి, పవన్‌కుమార్

చిక్కడపల్లి: అత్యంత మహిమగల ఉప్పలమ్మను భక్తితో పూజిస్తే అన్ని శుభాలే కల్గుతాయని సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్ అన్నారు. ఆదివారం గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్‌లో ఆలయ కమిటీ అధ్యక్షుడు వై.సంజీవరెడ్డి, కోశాధికారి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రావణమాస ఉప్పలమ్మ బోనాల ఉత్సవాలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ లక్ష్మీగణపతి దేవాలయం చైర్మన్ మారిశెట్టి నర్సింగరావు, ఆలయ కమిటీ సభ్యులు ప్రసన్నలక్ష్మి, పద్మావతి, ఎమ్మెస్ రాధా, భానుమతి, విజయ్‌కుమార్,సతీష్‌కుమార్, ఎమ్మెస్ సోనం, ముఖేష్, వై.కళ్యాణ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా శ్రావణ బోనాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: శ్రావణ మాసం పురస్కరించుకొని బాగ్‌లింగంపల్లిలో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు కుంభర్తి శివ ఆధ్వర్యంలో అమ్మవారికి బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఊరేగింపుతో సంజయ్యనగర్ ఎల్లమ్మ అమ్మవారికి బోనాలను సమర్పించారు.



సంజయ్యనగర్‌లో బోనాలను సమర్పిస్తున్న శివ తదితరులు

బొంతల బస్తీలో...

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్ రంగానగర్ బొంతల బస్తీలో ఆదివారం బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. స్థానికంగా ఉన్న కట్టమైసమ్మ, నల్లపోచమ్మ దేవాలయాలలో అమ్మవారికి భక్తులు బోనంతో నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అరవింద్ కుమార్‌యాదవ్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నర్సింగ్‌రావు అతిథులను శాలువాలతో సన్మానించారు.



బోనాల ఉత్సవాల్లో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్ తదితరులు



ఉప్పలమ్మ బోనాల వేడుకల్లో ఎమ్మెల్యే ముఠాగోపాల్, బీఆర్ఎస్ యువనేత జైసింహ

కమ్యూనిస్టు యోధుడు తరిమెల నాగిరెడ్డి



తరిమెల నాగిరెడ్డి వర్ధంతి సభలో సాధినేని వెంకటేశ్వరరావు తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విప్లవ కమ్యూనిస్టు యోధుడు తరిమెల నాగిరెడ్డి వర్ధంతి సభను ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నాగిరెడ్డి మిత్ర బృందం నిర్వహించింది. ఈ సందర్భంగా నాగిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి వారు నివాళులర్పించారు. అనంతరం సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి సాధినేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... భారత ప్రజా విప్లవ పందాను ఎలిగెత్తి చాటిన మహనీయుడని కొనియాడారు. భారత విప్లవానికి మార్క్సిస్టు విశ్లేషణను అందించిన కమ్యూనిస్టు విప్లవకారుల్లో తరిమెల నాగిరెడ్డి ఒకరని అన్నారు. భూస్వామ్య కుటుంబంలో జన్మించినప్పటికీ తన చిన్ననాటి నుంచి జాతీయ భావాలను పునికిపుచ్చుకొని కమ్యూనిజమే ప్రపంచిక దృక్పథంగా ఎంచుకొని పోరాటం చేశారన్నారు. తరిమెల నాగిరెడ్డి జీవితం విప్లవోద్యమానికి ఉత్తేజాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి మాట్లాడుతూ... పీడిత ప్రజలను చైతన్యం చేసిన గొప్ప యోధుడన్నారు. శీలం స్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, విప్లవ కవి నిఖిలేశ్వర్, సత్యనారాయణరెడ్డి, సదానందం తదితరులు పాల్గొని ప్రసంగించారు.

బీసీ బిల్లుల అమలుకై ప్రభుత్వం మాండమస్ పిటిషన్ వేయాలి

కాచిగూడ: బీసీ బిల్లు అమలు కోసం ప్రజా పోరాటంతో పాటు న్యాయపోరాటం చేయాల్సిన అవసరం ఉందని, సుప్రీంకోర్టులో మాండమస్ పిటిషన్ వేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్లాలన్నారు. ప్రభుత్వం ఘర్షణ పద్ధతిలో కాకుండా ప్రత్యామ్నాయ పద్ధతి ఆలోచించి రిజర్వేషన్లను పెంచే న్యాయ మార్గాన్ని ఆలోచించాలని ఆయన సూచించారు. కేంద్ర ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించి ధర్నాలు చేస్తే సరిపోదని, రిజర్వేషన్ల సాధన కోసం కేంద్రంతో సానుకూలంగా ఉండి అఖిల పక్షంతో అన్ని రాజకీయ పార్టీలతో మాట్లాడి పరిష్కరించాలని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బీసీ రిజర్వేష్ బిల్లులు రాష్ట్రపతి వద్ద మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ఈ బిల్లులపై రాష్ట్రపతి ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం బీసీ సామాజిక వర్గాల హక్కులను ఆలస్యం చేస్తోందనే ఆందోళనలను రేకెత్తిస్తోందన్నారు. ఈ సమస్యను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో మాండమస్ పిటిషన్ దాఖలు చేయాలని గుజ్జ సత్యం డిమాండ్ చేశారు.

నాలాలో కూలిన ప్రహరీ తొలగింపు



నాలాలో కూలిన ప్రహరీను తొలగింపుజేస్తున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

అంబర్‌పేట: వర్షాలతో తలెత్తే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు బాగ్‌అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ బీ.పద్మావెంకట్‌రెడ్డి తెలిపారు. వర్షానికి బతుకమ్మకుంట వద్ద ఉన్న నాల ప్రహరీ కూలడంతో వర్షపునీరు పరిసర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున నిలిచిపోయింది. దీంతో సమాచారం అందుకున్న కార్పొరేటర్ ఆదివారం జీహెచ్‌ఎంసీ అత్యవసర విభాగం వారితో కూలిన ప్రహరీ మట్టిని తొలగింపుజేసారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వర్షాలకు అధికార యంత్రంగా అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఏలాంటి ఇబ్బందులు ఉన్న తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



కాచిగూడ: రైల్వే ట్రాక్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... శివారంపల్లి-బుద్వేల్ రైల్వేస్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి (40) ఆరాంఘర్ బ్రిడ్జి రైల్ ట్రాక్ వద్ద పడి చనిపోయి ఉన్నాడు. మృతదేహాన్ని పోలీసులు ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ చిమ్నా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని



ఎమెల్యే ముఠాగోపాల్ను సన్మానిస్తున్న సంస్థ అధ్యక్షుడు డాక్టర్ గిడియాన్ బాబు

చిక్కడపల్లి: యువత నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, యూత్ మేళాలను వంటి ఆవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. జనరంజని స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గిడియాన్‌బాబుబాబు ఆధ్వర్యంలో ఆదివారం గోల్కొండ చౌరస్తాలోని ఎం.బి.చర్చిలో నిర్వహించిన యూత్ మేళాలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఠాగోపాల్ మాట్లాడుతూ చదువులు పూర్తయిన విద్యార్థులు నిత్యం కొత్త అంశాలను నేర్చుకోవాలని సూచించారు. అధునాతన సాంకేతికను సద్వినియోగం చేసుకోవాలి అన్నారు. ఈ సందర్భంగా యూత్ మేళాను ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువనాయకుడు ముఠా జయసింహ, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ దీపాన్ జాన్ ఉమ్మడి దీవేల్, డాక్టర్ సామ్ అబ్రహం, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రావులపాటి మోజస్, కమిటీ సభ్యులు కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

నవ భారత నిర్మాణంలో ముందుండాలి



తిరంగా యాత్రను ప్రారంభిస్తున్న భరత్‌గౌడ్ తదితరులు

ముషీరాబాద్: నవ భారత నిర్మాణంలో ప్రతి పౌరుడు భాగస్వామ్యం కావాలని మహంకాళీ జిల్లా అధ్యక్షుడు బీజేపీ భరత్‌గౌడ్ అన్నారు. ఆదివారం బీజేవైఎం ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ గడం నవీన్ ఆధ్వర్యంలో భోలక్‌పూర్‌లోని దేవుని తోటలో గల భవాని శంకర ఆలయ ప్రాంగణం నుంచి నిర్వహించిన తిరంగ యాత్రను భరత్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దేశ సమగ్రత, సమైఖ్యతకు ప్రధాని నరేంద్రమోదీ అంకిత భావంతో పని చేస్తున్నారని పేర్కొన్నారు. అవినీతి రహిత పాలన కొనసాగిస్తూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి పనులను పెద్ద ఎత్తున నిర్వహిస్తూ ఆదర్శ ప్రధాన మంత్రిగా మోదీ నిలుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.నవీన్‌గౌడ్, మద్దూరి శివాజీ, సురేష్‌కుమార్, అనిల్, ఆయూష్, సాయి, వెంకటేష్, సంతోష్, శ్యామ్, నర్సింహ్మా, బిజ్జి కనకేష్‌కుమార్, కంచి ముదిరాజ్ తదితరులున్నారు.

ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిత



విద్యార్థులకు స్కాలర్‌షిప్స్, స్టడీ మెటీరియల్ కిట్లను అందజేస్తున్న సీఎం స్పెషల్ డ్యూటీ ఆఫీసర్ శ్రీనివాసులు

కాచిగూడ: ఉన్నత చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని సీఎం స్పెషల్ డ్యూటీ ఆఫీసర్ వేముల శ్రీనివాసులు అన్నారు. వైశ్య హాస్టల్ ట్రస్ట్‌బోర్డు చైర్మన్, స్వాతంత్ర్య సమర యోధులు కోత్తూరు సీతయ్య గుప్తా 114వ జయంతి సందర్భంగా ఆదివారం కాచిగూడలోని వైశ్య హాస్టల్‌లో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ కిట్స్, స్కాలర్‌షిప్స్‌ను అయన ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కొత్తూరు సీతయ్యగుప్తా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కొత్తూరు సీతయ్య గుప్తా అందించిన సేవలను కొనియాడుతూ పలువురు ప్రముఖులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వైశ్య హాస్టల్ ట్రస్టబోర్డు చైర్మన్ కొత్తూరు జయప్రకాష్ రామ్, కొండ్లె మల్లికార్జున్, వెంపటి మధు, ఉప్పాల రాజశేఖర్, పబ్బతి రవి ప్రసన్న కుమార్, పొద్దటూరి రాజేశ్వర్ రావు, కూర జయరాములు గుప్తా, మ్యాడం దయాకర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

గురు రాఘవేంద్ర దర్శనం.. మోక్షానికి మార్గం

- పూర్వారాధన వేడుకల్లో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి
- తరలివచ్చిన భక్తజనం





కాచిగూడ: శ్రీరాఘవేంద్రస్వామి 354వ ఆరాధనోత్సవాల్లో భాగంగా ఆదివారం కాచిగూడ, లింగంపల్లిలోని శ్రీ రాఘవేంద్ర స్వామి బృందావన సమితిలో స్వామి వారి పూర్వారాధన కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఉదయం నిర్మాల్య విసర్జనం అనంతరం స్వామివారి బృందావనానికి భక్తుల అష్టోత్తర పారాయణం నడుమ పాలు, పంచామృతాలు, ఫలాలతో అభిషేకం చేశారు. ఉత్సవ మూర్తి ప్రహ్లాదరాయలకు మఠం అర్చకులు పాద పూజ, కనకాభిషేకం నిర్వహించారు. మధ్వ బ్రాహ్మణ సంప్రదాయం ప్రకారం గోపూజ, దాన్యలక్ష్మి పూజను నిర్వహించిన అనంతరం స్వామివారికి మంగళహారతి ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మంత్రాలయ శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో..

మంత్రాలయ శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో భక్తుల జయజయధ్వానాల మధ్య పూర్వారాధన వేడుకలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బర్కత్‌పురలోని స్వామివారి బృందావనానికి పాలు, పెరుగు, పండ్లు, తేనే, నెయ్యితో అభిషేకం చేశారు. మూల రాములు, దిగ్విజయరాములు, జయరాములు, సంతాన గోపాలకృష్ణ, వైకుంఠ వాసుదేవతామూర్తి విగ్రహ ప్రతిమలకు దూపదీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా స్వామివారికి నిర్మల్య విసర్జనం, అస్టోత్తర పారాయణం, పాదపూజ, విశేష పంచామృతం, తులసి అర్చన, అలంకార, హస్తోదక, మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ జరిగింది. వేద పండితులు, అర్చకులు స్వామివారి పూజలను ఘనంగా నిర్వహించారు. కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి పాల్గొని శ్రీ రాఘవేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కేంద్రమంత్రికి వేద పండితుల ఆశీర్వాదం అందజేశారు.



బర్కత్‌పురలోని మంత్రాలయ మఠంలో పూజలు చేస్తున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి